క్లుప్తంగా

అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో 42 కేసులు

కరీంనగర్‌క్రైం: ఎన్నికల సందర్భంగా కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఇప్పటివరకు 42 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ తాతాజీ తెలిపారు. రూ.66,385 విలువైన 60.35 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, 12 మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు చెప్పారు. సమయపాలన పాటించని 4 మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డా.ఫాతిమారెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్(సీబీఎస్ఈ) జట్టు వచ్చే నెల 4 నుంచి హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.ఫోలిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. అభినవ్, వెంకటరమణ, అశ్వత్‌రెడ్డి, మీనాక్షి, వైనవి, దుహిత ఇటీవల జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో సోమవారం అభినందించారు. కోట్ వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థి

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి కరాటే పోటీల్లో స్థానిక మెహర్‌నగర్‌లోని విద్యావాలీ పాఠశాలకు చెందిన టి.మణిదీప్ సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్ తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు మణిదీప్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాష్ రావు, వైస్ చైర్మన్ ఆర్.పృథ్వీరావు, కరాటే మాస్టర్ బి.ఐలయ్య అభినందించారు.

విద్యుదాఘాతంతో వానరం మృతి



మృతిచెందిన వానరం

కొత్తపల్లి: చింతకుంట పంచాయతీ పరిధి రాజీవ్ గృహకల్ప సైట్–1 సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై దూకి వానరం మృతిచెందింది. వనం వీడి జనంలో తిరుగుతున్న వానరాలతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి మృతిచెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం రాత్రి సమూహంగా వచ్చిన వానరాలు కొట్లాడగా.. అకస్మాత్తుగా ఓ కోతి ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై దూకడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఎల్‌టీ తీగలపై కోతి పడడంతో ఎలాంటి విద్యుత్‌కు అంతరాయం కలగనప్పటికీ అది దుర్మరణం చెందడం స్థానికులకు కలచివేసింది.

మంత్రి పరామర్శ

కొత్తపల్లి: నాగులమల్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యవర్గ కట్ల శ్రావణ్ అనారోగ్యంతో మృతిచెందగా.. సోమవారం ఆయన భౌతికకాయం వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. శ్రావణ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని, అధైర్యపడొద్దంటూ ఆర్థిక సాయాన్ని అందజేశారు. కమాన్‌పూర్ మాజీ సర్పంచ్ బోనాల రామయ్య ఇటీవల మరణించగా.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, నాయకులు, కార్యకర్తలున్నారు.

మహిళలకు రక్షణ కరువు

కరీంనగర్ కార్పొరేషన్: బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చేర్ల పద్మ విమర్శించారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ రెండు పార్టీల ప్రభుత్వాల్లో రోజుకోచోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు, అవమానాలు సర్వసాధారణమయ్యాయని ఆరోపించారు. హాస్టళ్లలోని విద్యార్థినులపై సిబ్బంది, అధ్యాపకులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. డీసీసీ కార్యదర్శి సిరికొండ శివప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటేస్తాం.. భవితకు బాటేస్తాం..

- తొలిసారి ఓటేయనున్న యువత మనోగతం

కరీంనగర్ అర్బన్: ప్రజాస్వామ్య దేశంలో ఓటే బ్రహ్మాస్త్ర ఆయుధం. ఓటుతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నది రాజ్యాంగం చేసిన హితబోధ. ప్రజాసంక్షేమం, యువత, సకల వర్గాలకు ప్రాధాన్యమిచ్చే అభ్యర్థికే ఓటేస్తామని చెబుతున్నారు కొత్త ఓటర్లు. రానున్న శాసనసభ ఎన్నికల్లో యువత ఓటేసేందుకు భారీగా దరఖాస్తులు చేసింది. సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వహించేవారు, విద్యనభ్యసించేవారు వచ్చి తొలిసారిగా ఓటును వినియోగించుకోనున్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటును పవిత్రంగా వినియోగిస్తామని చెబుతున్నారు.

కరీంనగర్ నియోజకవర్గంలో వయసువారీగా ఓటర్లిలా..

వయసు	ఓటర్లు
18–19	6,356
20–29	64,257
30–39	87,924
40–49	74,741
50–59	53,572
60–69	32,742
70–79	17,045
80కి పైగా	5,276

అన్నీ చూసే ఓటేస్తా



అన్నింటిని బేరీజు వేసుకొని మొదటిసారి ఓటు వేస్తా. ఓటుతో మంచి నాయకున్ని ఎన్నుకునే అవకాశముంటుంది. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కులమతాలకతీతంగా 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించింది. ప్రతి ఒక్కరూ మంచి అభ్యర్థిని గుర్తించి ఓటెయ్యాలి. నోటుకు అమ్ముడుపోతే ఓటును అపహాస్యం చేసినట్లే.

– గూడూరి దివ్య, జ్యోతినగర్

సంతోషంగా ఉంది



పత్రికలు, టీవీల్లో ఎన్నికల గురించి చదివేవాన్ని.. వినేవాన్ని. ఓటు ఎంత విలువైందో ఈరోజే తెలిసింది. నాకు ఓటు హక్కు రావడం సంతోషంగా ఉంది. తొలిసారి అసెంబ్లీ ఎన్నికలో ఓటును వినియోగించుకుంటున్నా. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటింది. నిజాయతీతో వినియోగిస్తే మంచి నాయకుడొస్తాడు.

– బండారి సాయివికాస్, రాంనగర్

ఓటుపై మమకారంతో వచ్చా



ఓటు విలువ ఏమిటో తెలుసు కాబట్టే హైదరాబాద్ నుంచి వచ్చా. హైదరాబాద్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తా. శాసనసభ ఎన్నికల క్రమంలో ఓటు హక్కు పొందాను. ఓటు వేయడం దేశ సేవ చేసినంత ఆనందం. గతంలో తోటి యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించా.

– ప్రణీత, కొత్తపల్లి

డబ్బులిస్తామంటే వద్దన్న..



ఎన్నికలు ఇలా ఉంటాయని ఎప్పుడూ అనుకోలేదు. నిజాయతీగా ఎన్నికల ప్రచారం జరగాలి. కానీ ప్రలోభాలు సరికాదు. పార్టీల నాయకులు డబ్బులిస్తాం మాకే ఓటేయమని అడిగారు. ఓటును అమ్ముకుంటే దానికున్న ప్రాధాన్యం కించపరిచినట్లే. అందుకే నేనెవరి వద్ద డబ్బులు తీసుకోలె. నిస్వార్థంగా ఓటేస్తా.

– అభిషేక్‌పటేల్, గణేశ్‌నగర్

విలువ తెలిసింది



ఎన్నికలంటే ఏమిటో అనుకున్నా. ఓటు విలువ ఇప్పుడు తెలిసింది. మా పార్టీకే ఓటేయమని ఎవరెవరో వచ్చి మాట్లాడిస్తున్నారు. అంటే ఓటరుగా ఉంటేనే సమాజంలో విలువ. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును శాసనసభ ఎన్నికలో తొలిసారిగా సద్వినియోగం చేసుకుంటా.

– జి.చందు, విద్యానగర్

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



కరీంనగర్‌కల్చరల్: హాజరైన భక్తులు

కరీంనగర్‌కల్చరల్: భగత్‌నగర్‌లోని అంజనాద్రి దేవాలయంలో సోమవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో గల సుబ్రహ్మణ్యస్వామికి అభిషేక అర్చనలు, విశేషాలంకారం చేశారు. పార్థివ లింగాలకు భక్తులతో అభిషేకాలు చేయించారు. చిలకపాటి హనుమంతారావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకం



విద్యానగర్: అభిషేకం చేస్తున్న పూజారి

విద్యానగర్(కరీంనగర్): కృతికా నక్షత్రం సందర్భంగా సోమవారం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో కొలువై ఉన్న ఉమాసుతుడైన శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణశర్మ విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి



తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ ఉమ్మడి జిల్లా క్రీడలకు, క్రీడా రంగానికి పుట్టినిల్లు అని, రాష్ట్రస్థాయిలో జరిగే అన్ని క్రీడల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతాకల పంట పండించి తెలంగాణలో జిల్లా కీర్తి పతాకాన్ని ఎగరేయాలని మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కదారి సునీతాఅనంతరెడ్డి అన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్–14 బాలబాలికల జూడో పోటీలు కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో జరిగాయి. ఈ పోటీలను ఆమె రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి పోతన శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జూడో పోటీలకు వేదిక మానేరు విద్యాసంస్థలని అన్నారు. ఎస్జీఎఫ్ఐ రాష్ట్ర జూడో పోటీల నిర్వహణ మానేరు విద్యాసంస్థలకు కల్పించాలని ఎస్జీఎఫ్ఐ శ్రీనివాస్‌ను కోరారు. జూడో సంఘం రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. జూడో క్రీడకు పెట్టింది పేరు కరీంనగర్ అని అన్నారు. ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా జూడో పోటీలకు కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు 150 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. రాణించిన క్రీడాకారులను నవంబర్ 1 నుంచి 3 వరకు హన్మకొండలో జరిగే 67వ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ అర్బన్ ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి అంతటి శంకరయ్య, పెద్దపల్లి జిల్లా జూడో సంఘం కార్యదర్శి సిలివేరి మహేందర్, పీడీ, పీఈటీలు రాజ్‌కుమార్, ఎల్వీ రమణ, హన్మంతు, జ్యోతి, జిట్ట బోయిన శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రాంతీయ క్రీడా పాఠశాల జూడో కోచ్ సాయిరాంయాదవ్, సుధాకర్, శ్రీధర్‌కుమార్, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే బీజేపీ బీసీ జపం



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

కరీంనగర్: ప్రజలను దగా చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని, తొమ్మిదిన్నరేళ్లుగా బీసీల కోసం బీజేపీ చేసిందేమీ లేదని, తాజాగా బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎంను చేస్తామని నేతలు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. సోమవారం మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని గ్రహించిన బీజేపీ నేతలు బీసీ ముఖ్యమంత్రి అంటూ కొత్త నాటకానికి తెర లేపారని మండిపడ్డారు. ఎంపీ బండి సంజయ్ ఇకనైనా చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పి ఓట్లడిగితే బాగుంటుందని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లుగా నయా పైసా పని చేయకుండా కుట్రలు, కుతంత్రాలతో కులమతాల మధ్య చిచ్చురేపడం మినహా చేసిందేమీ లేదని ఆరోపించారు. బండి సంజయ్ ఎమ్మెల్యే టికెట్ వచ్చాక ప్రచారంలో పాల్గొనకుండా మౌనవ్రతం దాల్చడం దేనికో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీజేపీకి శృంగభంగం తప్పదని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, కులదీప్‌వర్మ, నవాజ్, షౌకత్ అలీ, అరె రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న తాజొద్దీన్

కరీంనగర్ కార్పొరేషన్: ఎన్నికల వేళ మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న మతతత్వ బీజేపీకి గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాజొద్దీన్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అనడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికలు రాగానే హిందువులు, ముస్లింల నడుమ గొడవలు సృష్టించడం బీజేపీ నాయకులకు అలవాటేనన్నారు. ముస్లిం మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన కిషన్‌రెడ్డిపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకులు నేహాల్ అహ్మద్, మహమ్మద్ చాంద్, హనీఫ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ప్యారడైజ్ విద్యాసంస్థల చైర్మన్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కమలాకర్

కొత్తపల్లి: కొత్తపల్లి, రేకుర్తిలోని ప్యారడైజ్, సెయింట్ జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కరీంనగర్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సోమవారం ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విద్యావేత్తలంతా బీఆర్ఎస్ పార్టీని బలపరిస్తే భవిష్యత్‌కు బంగారు బాటలు వేయొచ్చని మంత్రి పేర్కొన్నారు. నగర మేయర్ వై.సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ నాయకులు నందెల్లి మహిపాల్, రమేష్, శ్రీకాంత్, సత్యనారాయణ, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

మంత్రి సతీమణి ప్రచారం



ఎలగందులలో ప్రచారం చేస్తున్న గంగుల రజిత

కొత్తపల్లి: ఎలగందుల గ్రామంలో మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టు పెడుతూ ఓట్లు అభ్యర్థించారు. ప్రజలంతా మరోమారు ఆశీర్వదిస్తే రెట్టించిన ఉత్సాహంతో కమలాకర్ పని చేస్తారని తెలిపారు. ఎంపీపీ పిల్లి శ్రీలత, జెడ్పీటీసీ పిట్టల కరుణ, సర్పంచ్ ఎర్రండి షర్మిల, ఎంపీటీసీ రమేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బోనాల శంకర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తనయుడి ప్రచారం



ఇరుకుల్లలో ప్రచారం చేస్తున్న హరిహరన్

కరీంనగర్‌రూరల్: బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తనయుడు హరిహరన్ ఇరుకుల్లలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హన్మాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఇంటింటా తిరుగుతూ అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలుసుల శారద, ఉప సర్పంచ్ ఎం.శంకర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు సర్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు నేరెల్ల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జువ్వాడి రాజేశ్వర్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు దాది సుధాకర్, జువ్వాడి మారుతీరావు, బలుసుల శంకరయ్య, బుర్ర రమేశ్‌గౌడ్, స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రిప్ట్‌పై సంతకాలు చేసినోళ్లా మాట్లాడేది..?



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కరీంనగర్ టౌన్: బీజేపీ నుంచి సస్పెండైన కార్పొరేటర్లు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొంటూ బండి సంజయ్‌పై బురద చల్లడం హాస్యాస్పదమని ఆ పార్టీ నేతలు విమర్శించారు. బీఆర్ఎస్ రాసిచ్చిన స్క్రిప్‌పై సంతకాలు చేసిన ఆయా నాయకులకు బండి సంజయ్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బండి సంజయ్ కరీంనగర్ కోసం ఏం చేశారో? ప్రజల పక్షాన ఎలాంటి పోరాటాలు చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. సోమవారం సాయంత్రం బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గాయత్రి ప్రసాద్, సౌత్ జోన్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి విజయ్ తదితరులు కరీంనగర్‌లో మాట్లాడుతూ.. సస్పెండైన బీజేపీ కార్పొరేటర్లు కచ్చు రవి, మర్రి భావన, సతీష్ తీరుపై మండిపడ్డారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే కారణంతో సస్పెండైన మర్రి సతీష్ దంపతులు ఇప్పుడు రాజీనామా చేసి బండి సంజయ్‌పై బురద చల్లడం చూస్తుంటే నవ్వొస్తోందన్నారు. కార్పొరేటర్ కచ్చు రవి కాదు.. ఆయన పేరు ఖర్చు రవి అని అన్నారు.

అవగాహన లేకే మంత్రుల వ్యాఖ్యలు

కరీంనగర్ కార్పొరేషన్: 40సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందంటూ బీఆర్ఎస్ మంత్రులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గూడ కనుకయ్య విమర్శించారు. బీఆర్ఎస్ గొప్పగా చెప్పుకుంటున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఇచ్చిందే కాంగ్రెస్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, లోయర్ మానేరు తదితర ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని చెప్పారు. రామగుండం థర్మల్ ప్రాజెక్ట్ నిర్మించిందీ కాంగ్రెస్సేనన్నారు. ఇలాంటి ఎన్నో ప్రాజెక్టులతో పాటు అంతర్జాతీయ స్థాయిలో విమానాశ్రయాలు, గ్రామస్థాయిలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

సంయమనం పాటించాలి

కరీంనగర్: కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తులు పూర్తిస్థాయిలో కొలిక్కిరానందున సీపీఐ కార్యకర్తలు సంయమనం పాటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజ్యాంగాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఏకీకరణతో సీపీఐ ఇండియా కూటమిలో భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కూడా ఎన్నికలున్నందున దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సీపీఐతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పొత్తులు పెట్టుకొనేందుకు ముందుకొచ్చిందని అన్నారు. రాష్ట్రంలో సీపీఐకి 5 స్థానాలు కావాలని కాంగ్రెస్ ముందు ప్రతిపాదనలు పెట్టగా.. సీట్ల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ కాలయాపన చేస్తుందన్నారు. సీపీఐ కోరిన స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిందని అన్నారు. నవంబర్ 1న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరగనుందని, ఆ సమావేశంలో రాష్ట్ర పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండి సీపీఐ శ్రేణులు పని చేయాలని కోరారు.

శబరిమలకు మహా పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర బృందాన్ని కలిసిన మంత్రి గంగుల

కరీంనగర్ కల్చరల్: ప్రతీ ఏటా వేణుగోపాల్ గురుస్వామి ఆశీస్సులతో కరీంనగర్‌కు చెందిన గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి శబరిమల వరకు నిర్వహించే మహా పాదయాత్ర సోమవారం జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభమైంది. గిద్దె పేరుమాండ్ల దేవాలయం వద్ద మంత్రి గంగుల కమలాకర్ అయ్యప్ప స్వాములను కలిశారు. కరీంనగర్, హైదరాబాద్(తెలంగాణ), కర్నూల్, అనంతపూర్(ఏపీ), చిక్బల్లాపూర్, దేవనపల్లి(కర్ణాటక), ఉర్సూర్, సేలం(తమిళనాడు), కుమిలి, వెండి పెరియా, పులిమేడ(కేరళ) ద్వారా శబరిమల చేరనుంది. సుమారు 130 మంది అయ్యప్ప స్వాములు రోజూ 22 కిలోమీటర్ల చొప్పున 45 రోజుల పాటు పయనిస్తూ 1,400 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసి డిసెంబరు 14న సన్నిధానంలో అయ్యప్పను దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా గడప నాగరాజు గురుస్వామి మాట్లాడుతూ.. స్వామి దయ అందరిపై ఉండాలని అన్నారు. లోక కల్యాణార్థం ఈ యాత్ర చేపడుతున్నామని, ఇది 23వ పాదయాత్ర అని పేర్కొన్నారు. సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సురేశ్, హరినాథ్, రాజ్‌కుమార్, నమిలకొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.